క్లుప్తంగా

అక్షితల వితరణ



అక్షితల వితరణలో కాలనీవాసులు

తుర్కయంజాల్: అయోధ్య శ్రీరామ అక్షితల వితరణ కార్యక్రమం పురపాలక సంఘం పరిధిలోని పలు కాలనీల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాగన్నగూడలోని హెవెన్స్ కార్నర్‌లో కాలనీ అధ్యక్షుడు యాదగిరి రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన వితరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్మటి వెంకట్ రెడ్డి, కాలనీవాసులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కళాకారులకు ఆర్థికసాయం

తలకొండపల్లి: కళాకారులకు అండగా ఉంటానని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెల్జాలో కళాకారులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. కళలను ప్రోత్సాహించాలనే ఉద్దేశ్యంతోనే ఆర్థిక సహాయం అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో యాదయ్య, శ్రీకాంత్ యాదవ్, శ్రీశైలం యాదవ్, అభిలాష్, సుధాకర్, శ్రీశైలం, వెంకటయ్య, పరంధాములు, సుల్తాన్, సత్యం, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

12న రక్తదాన శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఈనెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతీయువకులు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వారు కోరారు.

జాపాలలో పశువైద్య శిబిరం

మంచాల: మంచాల మండల పరిధిలోని జాపాలలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 45 పాడి పశువులకు కృత్రిమ గర్భనిర్ధారణ పరీక్షలు చేశారు. మరో పది పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో జాపాల సర్పంచ్ నాహిదా బేగం, ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపసర్పంచ్ మల్లప్ప, మంచాల, ఆరుట్ల, కొంగర కలాన్ పశువైద్యశాల వైద్యులు సుధారెడ్డి, వి.నాగమణి, సురేందర్, వీఎల్‌ఓలు కృష్ణ, వీరారెడ్డి, గోపాల మిత్రలు బాబురావు, శ్రీను, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపు ప్రారంభం



రేషన్ షాప్‌ను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ రాధమ్మ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సంకటోనిపల్లికి నూతనంగా మంజూరైన రేషన్‌షాపును మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్, కౌన్సిలర్ కమటం రాధమ్మ ప్రారంభించారు. రేషన్ సరుకులను సకాలంలో, సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ మాధవి, మాజీ ఎంపీపీ ధనుంజయ, స్థానిక నాయకులు కమటం వెంకటయ్య, శ్రీపాల్, అనంతరాములు, యాదగిరి, కిష్టయ్య, మహేశ్, రవి, భాస్కర్, నరేశ్, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

సర్పంచ్ రవీందర్



క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ రవీందర్

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని సర్పంచ్ రవీందర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోవిందాయిపల్లిలోని క్రీడాకారులకు, యువకులకు ప్రభుత్వం నుంచి మంజూరైన వాలీబాల్, క్రికెట్ కిట్లను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి సర్పంచ్ అందజేశారు. ప్రభుత్వం అందజేసిన కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, నాయకులు.. శ్రీశైలం, చెన్నయ్య, రహీమ్, ఈదమయ్య, జంగయ్య, వెంకటేశ్, శేఖర్, జంగయ్య, చెన్నయ్య, సత్యనారాయణ ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పాలకవర్గం

మంచాల: మంచాల మండల కేంద్రంలోని ప్రాథమిక రైతు సహకార సంఘం కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రైతుల శ్రేయస్సు, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ యాదయ్య, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబంధు వచ్చేనా?

ప్రశ్నార్థకంగా పెట్టుబడి సాయం
- మంచాల మండలంలో సగం మందికి కూడా అందని డబ్బులు
- అర్హతపై ఒక్కొక్కరిదీ ఒక్కోమాట
- అయోమయంలో అన్నదాతలు



మంచాల: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం అమలు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పట్టా పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించేది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించటంతో పెట్టుబడి సాయంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ ఏర్పాటు అనంతరం కొంతమందికి మాత్రమే పెట్టుబడి సాయం అందింది. మిగితావారికి వస్తుందా.. లేదా అనే సందేహం ఇప్పుడు రైతుల్లో నెలకొని ఉంది. వివరాల్లోకి వెళ్తే.. గత ప్రభుత్వం రెవెన్యూ శాఖ వారు మంజూరు చేసిన పట్టా పాసుపుస్తకం ఉంటే చాలు ప్రతి రైతుకు రైతుబంధు పథకం కింద పంట పెట్టుబడి సాయం వచ్చేది. అందులో సాగుభూమి, సాగుకు యోగ్యం కాని భూమి అని ఏదీ కూడా పరిశీలన చేయలేదు. సాగు యోగ్యం కాని గుట్టలకు, సాగు చేయని భూములకు సైతం ఇచ్చారు. పట్టా పాసు పుస్తకమే ప్రధాన ఆధారంగా తీసుకొని అందరికీ ఇచ్చారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతుబంధు పథకం కొందరికే వచ్చింది. అదికూడా రెండు ఎకరాల్లోపు భూమిగల రైతులకే వచ్చింది. మంచాల మండలంలో వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల ప్రకారం గతంలో 32,800 ఎకరాలకు సంబంధించి 18,869 మంది రైతులకు రూ.15కోట్ల 72లక్షలు రైతుబంధు సాయం అందించారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 10,200 మంది రైతులకు రూ.4కోట్ల20లక్షలు మాత్రమే రైతుబంధు సాయం అందించింది. మిగతా 40శాతం మంది రైతులకు రైతుబంధు అందలేదు. కేవలం రెండు ఎకరాల్లోపు ఉన్నవారికే రైతుబంధు సాయం వస్తుందని కొంతమంది అంటుంటే.. ఐదు ఎకరాల్లోపు ఉన్నవారికి కూడా సాయం అందుతుందని మరి కొందరు చెప్తున్నారు. కేవలం సాగుచేసిన భూములకు మాత్రమే రైతు బంధు ఇస్తారని పుకార్లు హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో రైతుబంధు సాయం అందని రైతులు అయోమయంలో పడ్డారు. ఇప్పటికైనా రైతుబంధు సాయం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి రైతుకు ఇవ్వాలి



ఇటీవల అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు కొందరికి మాత్రమే రైతుబంధు సాయం అందించింది. మండలంలో చాలామంది రైతులకు సాయం అందలేదు. వ్యవసాయ పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు పెట్టు బడి సాయం అందించాలి. – రవి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, నోముల

నివేదిక పంపించాం



గతంలో మాదిరిగానే రైతుబంధు పథకం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాం. కొంతమందికి ఇప్పటికే పెట్టుబడి సాయం అందింది. ఎవరు అర్హులు అనే విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. – జ్యోతిశ్రీ, మండల వ్యవసాయాధికారి, మంచాల

ఇనాంగూడలో ఉచిత వైద్య శిబిరం



కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకాలను వివరిస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బ్యాంక్ ఆఫ్ బరోడా బాటసింగారం బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనాంగూడలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ అంతటి యశోద ఉషయ్య గౌడ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఇలాంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరంలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాల గురించి ప్రజలకు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేశం అఖిలేష్‌గౌడ్, ఇబ్రహీంపట్నం డీఎంహెచ్‌ఓ డా.ధరణి, డా.సత్యప్రకాష్, డా.కల్పన, బ్యాంక్ ఆఫ్ బరోడా బాటసింగారం బ్రాంచ్ మేనేజర్ ఎల్.రమేష్, బ్రదర్ సింగ్, వార్డుసభ్యులు, హెచ్‌ఈఓ లక్ష్మీనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఏఎన్ఎం భాగ్య, హెచ్ఏ యాదగిరి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మన్‌తో ఆదివాసీల అభివృద్ధి

తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ



చెంచులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కడ్తాల్: చెంచు, ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం జన్‌మన్(ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ్ అభియాన్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎక్వాయిపల్లితో పాటు, పలు చెంచు కాలనీల్లో ఆయా చెంచు కుటుంబాలతో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్‌మన్ పథకంలోని 11 రకాల లాభాలను వివరించారు. సురక్షిత మంచినీరు, వృత్తి నైపుణ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యుత్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా, ఎన్ఆర్ఈజీఎస్ జాబ్‌కార్డులు, కుల సర్టిఫికెట్ మొదలైన కనీస సౌకర్యాలు కల్పించడం కొరకు అవగాహన సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలను చెంచులు సద్వియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ, ఏపీఎం రామేశ్వరి, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఏసీపీ భీంరెడ్డి

ఊరెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి

వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి

హస్తినాపురం: నగరం నుంచి సంక్రాంతి పండుగకు ఊరికి వెళ్లే వారు విలువైన వస్తువులను, నగదును ఇంట్లో పెట్టకుండా బ్యాంకు లాకర్లలో లేదా బ్యాంకుల్లో భద్రపర్చుకోవాలని వనస్థలిపురం ఏసీపీ ఎస్.భీంరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఉద్దేశించిన ప్రచార ఆటోను మంగళవారం సీఐ వెంకట్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ భీంరెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు ఊరెళ్లే సమయంలో వీలైనంతవరకు ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి బయట గొళ్లెం పెట్టవద్దన్నారు. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని, బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలని సూచించారు. ఊరుకు వెళ్తున్న విషయంపై ముందుగా మీ సమీప బంధువులకు, మిత్రులకు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏసీపీ వెల్లడించారు. వనస్థలిపురం సీఐ వెంకట్, ఎస్ఐలు జగన్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు సహకారం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



విద్యారణ్య భారతి స్వామిజీతో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కొనకట్ట వద్ద ఉన్న శ్రీ హరిహర అఖండ క్షేత్రంలో 108 అడుగుల హనుమాన్ విగ్రహ సంకల్పానికి తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. విద్యారణ్య భారతి స్వామీజీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన పవనమాన హోమం కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మట్లాడుతూ.. హరిహర అఖండ క్షేత్రంలో వెలిసే హనుమాన్ విగ్రహం రాష్ట్రంలోనే ఒక గొప్ప క్షేత్రం కావాలన్నారు. అందుకు పూర్తి సహకారాన్ని అందిస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఈ ఆలయ పరిసరాల్లోని ప్రభుత్వ భూమిని ఈ క్షేత్ర అవసరాల కోసం ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యారణ్య భారతి స్వామిజీ మాట్లాడుతూ.. ఆంజనేయ స్వామి ఎక్కడ ఉంటే అక్కడ అంతా శుభమే కలుగుతుందన్నారు. మార్చి 30న హనుమాన్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆ క్షేత్ర సమితి వ్యవస్థాపకులు సదా వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వరకే రాజకీయాలు

- అభివృద్ధి పనుల్లో వాటికి చోటు లేదు
- అందరూ సమన్వయంతో పనిచేయాలి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి
- చేపట్టాల్సిన పనులను సభ దృష్టికి తీసుకువచ్చిన సభ్యులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని.. ఆ తర్వాత అందరూ అభివృద్ధే ధ్యేయంగా కలిసి పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు చోటు లేదని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో మంగళవారం ఎంపీపీ అనిత విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీ రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో వివిధ శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా..

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ–82 కాలువ నిర్మాణానికి భూములు అందించిన రైతులకు రావాల్సిన పరిహారాన్ని వీలైనంత త్వరగా అందేలా చూస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి అన్నారు. కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇప్పించాలని సభలో పోలెపల్లి ఎంపీటీసీ కుమార్ ప్రస్తావించారు. దీనిపై ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ.. భూముల పరిహారానికి సంబంధించి రూ.16 కోట్లు అందించాల్సి ఉందని ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకుపోయి వెంటనే అందిస్తామని అన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

సభా నిర్వహణలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు సూచించారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోకుండా కలిసి పనిచేయాలని కోరారు. ఈజీఎస్ పనులను సద్వినియోగం చేసుకుని గ్రామాలను అభివృద్ధి చేయాలని కోరారు. మండల సమావేశాలకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే సమక్షంలోనే విమర్శలు

మండల సభలో పలుసార్లు పోలెపల్లి ఎంపీటీసీ సభ్యుడు దోనాదుల కుమార్, మాలెపల్లి సర్పంచ్ శ్రీనయ్య మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. డీ–82 కాలువ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించాలని ఎంపీటీసీ కుమార్ కోరగా గత ప్రభుత్వ హయాంలో ఎందుకు ప్రశ్నించలేదని సర్పంచ్ శ్రీనయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరువురు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకున్నారు. వేదికపై ఉన్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే కసిరెడ్డి జోక్యం చేసుకున్నా ఆగకుండా విమర్శలు చేసుకున్నారు.

రోడ్డు పనులు చేపట్టండి

ఆమనగల్లు మండలంలో పలు గ్రామాలకు మంజూరైన బీటీరోడ్ల నిర్మాణ పనులను చేపట్టాలని వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఎంపీటీసీ కుమార్, సర్పంచ్ రజిత తదితరులు కోరారు. టెండరు ప్రక్రియ ముగిసినా పనులు ప్రారంభం కావడం లేదని అధికారులు జోక్యం చేసుకుని పనులు చేపట్టాలని వారు కోరారు. సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభిస్తామని ఏఈ కృష్ణయ్య హామీ ఇచ్చారు. మంగళపల్లి నుంచి చెన్నారం రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని వైస్ ఎంపీపీ అనంతరెడ్డి కోరారు. ఈజీఎస్ కూలీలకు జాబ్ కార్డులు అందించాలని పలువురు కోరగా దరఖాస్తు చేసుకుంటే వారం రోజుల్లో అందిస్తామని ఎంపీడీఓ ఫారూక్ హుస్సేన్ తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు కలుగుతున్నాయని సర్పంచ్ అమర్‌సింగ్ ఫిర్యాదు చేశారు. పాఠశాలల్లో స్వీపర్ పోస్టులను భర్తీ చేయాలని పోలెపల్లి సర్పంచ్ బల్‌రాం కోరారు. సర్పంచ్‌ల పదవీకాలన్ని ఆరునెలల పాటు పొడిగించాలని సర్పంచ్ కొప్పు మంజుల కోరారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివంగత నేత జైపాల్‌రెడ్డి విగ్రహం ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ అనంతరెడ్డి కోరారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సత్కారం

ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి ఆమనగల్లు మండల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, ఎంపీటీసీలు సరిత, హాజీపాషా, సర్పంచ్‌లు సోనశ్రీనునాయక్, లక్ష్మణ్, ఎగిరిశెట్టి గోదాదేవి, ప్రేమలత, నర్సింహారెడ్డి, అమర్‌సింగ్, వివిధ శాఖల అధికారులు లలిత, అరుణకుమారి, శ్రీలత, సర్దార్‌నాయక్, కృష్ణయ్య, రవితేజ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

భూములను అన్యాక్రాంతం కానివ్వం

- లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయ భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు
- పనులను పర్యవేక్షించిన దేవాదాయ శాఖ అధికారులు



ఆలయ భూమలను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కడ్తాల్: ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా దేవాదాయ శాఖ అధికారులు రక్షణ చర్యలు ప్రారంభించారు. మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి సంబంధించిన భూములు మండల కేంద్రంలో సర్వే నంబర్ 76లో 6.05 ఎకరాలు, మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో సర్వేనంబర్ 130లో 3.06 ఎకరాలు, సర్వేనంబర్ 120లో 15.31 ఎకరాలు, సర్వేనంబర్ 125లో 9.32 ఎకరాల భూములు ఉన్నాయి. కాగా ఆలయ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని గతంలో ఆరోపణలు రావడంతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూములకు ల్యాండ్ ఏడీ ద్వారా సర్వే చేయించారు. ఈమేరకు ప్రజాప్రతినిధులతో కలిసి దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం ఆలయ భూములకు కంచె ఏర్పాటు పనులను ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు, మండల ఇన్‌చార్జి ఈఓ స్నేహలత, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్ ఈ పనులను పర్యవేక్షించారు.

భూములను స్వాధీనం చేసుకుంటాం..

దేవాదాయ శాఖ ఈఓ మోహన్‌రావు మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 120లో అక్రమణకు గురైన 1.28 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా సర్వే నెంబర్ 120లో మరో 26 గుంటల భూమి కూడా అన్యాక్రాంతమైందని.. రెండుమూడు రోజుల్లో సమీప రైతు వ్యవసాయ పొలానికి తిరిగి సర్వే నిర్వహించి అన్యాక్రాంతమైన భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్ 130లో 128 గజాల్లో ఒకరు ఇంటి నిర్మాణం చేపట్టారని, అదే విధంగా 222 గజాల్లో అన్మాస్‌పల్లిలో వాటర్‌ట్యాంకు, జీపీ కార్యాలయం, స్కూల్‌ను నిర్మించడం జరిగిందని.. దీనికి సంబంధించి అన్మాస్‌పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శికి నోటీసులు అందజేయడం జరిగిందని తెలిపారు. ఇదిలా ఉండగా సర్వే నంబర్ 125లో కంచె ఏర్పాటు చేస్తుండగా సమీపంలోని ఓ వెంచర్ నిర్వాహకులు అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డుకున్నారు. ఈ భూమి తమదని, దేవాలయ భూమి కాదని అధికారులతో వాదనకు దిగారు. తిరిగి రెండు రోజుల్లో సర్వే చేపడదామని అప్పటివరకు కంచె ఏర్పాటు చేయవద్దని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సరే అని చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఆలయ భూములను అన్యాక్రాంతం కానివ్వమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు శాయిరెడ్డి, బాబు, వార్డుసభ్యులు భిక్షపతి, మల్లయ్య,రాజు, రామకృష్ణ, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు

కడ్తాల్: ఉపాధ్యాయుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం పీఆర్‌టీయూ టీఎస్–2024 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతమ్మ, సంఘం నాయకులు కిశోర్‌కుమార్, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

దశలవారీగా కాలనీల అభివృద్ధి

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



శ్రీపురంకాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్

ఎల్‌బీనగర్: కాలనీలోని ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్–2 కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు వంటి సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. వివిధ శాఖల ఏఈలు రాకేష్, రణధీర్, రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రిక్షాల్లోనే వేయాలి

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన దుకాణదారులకు అవగాహన కార్యక్రమంలో కార్పొరేటర్ లచ్చిరెడ్డి పాల్గొన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా చెత్త రిక్షాల్లోనే వేయాలని.. బయట ఎక్కడా వేయకూడదని తెలిపారు.